క్లుప్తంగా

ఘనంగా నృసింహ జయంతి



యజ్ఞం చేస్తున్న వేద పండితులు

బీచ్‌రోడ్డు: హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో బుధవారం పాండురంగ స్వామి దేవాలయంలో నరసింహ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శాస్త్రోక్తంగా యజ్ఞ కుండీని అలంకరించి వేద పండితులచే మంత్రాలతో యజ్ఞం చేశారు. అనంతరం హరే కృష్ణ మూవ్‌మెంట్ ప్రెసిడెంట్ భక్తదాస భక్తులకు నరసింహ స్వామి అవతారం ప్రాముఖ్యాన్ని వివరించారు. నృసింహ స్వామికి మంగళ హారతి ఇచ్చి భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

వికసించిన మే పుష్పాలు



ఆరిలోవ : జీవీఎంసీ 12వ వార్డు కొండవాలు ప్రాంతంలోని ఓ ఇంట్లో అరుదైన 'మే' పుష్పాలు వికసించాయి. స్థానిక ఈశ్వరినగర్‌లో కె.కృష్ణ పాత్రుడు ఇంటి ఆవరణలో ఆరేళ్ల క్రితం కేరళ నుంచి తీసుకొచ్చి మే పుష్పం విత్తనం నాటారు. అది ఐదేళ్లకు గత ఏడాది మేలో పువ్వు పూసింది. ఏడాది తర్వాత మళ్లీ బుధవారం రెండు పువ్వులు పూసింది. ప్రతి సంవత్సరం మే నెలలో ఒకసారి మాత్రమే ఈ మొక్కకు పువ్వు పూయడం విశేషం. ఇవి వారం రోజులు వికసించి వుంటాయని ఆయన తెలిపారు. అందమైన ఈ పువ్వులు చూసేందుకు స్థానికులు ఆసక్తి కనబరుస్తున్నారు.

డెబ్రిస్ తొలగించండి



శివాజీపాలెం రోడ్డు పక్కన డెబ్రిస్ కుప్ప

మద్దిలపాలెం: శివాజీపాలెం ప్రధాన రహదారికి అనుకుని ప్రవహిస్తున్న పెద్ద కాలువ పక్కన కుప్పలుగా డెబ్రిస్ వేసి వదిలేశారు. దీంతో రోడ్డుపై రాకపోకలు ఇబ్బందిగా ఉంది. సంబంధిత అధికారులు స్పందించి డెబ్రిస్‌ను తొలగించాలని కాలనీవాసులు, వాహన చోదకులు కోరుతున్నారు.

27 నుంచి నోటి క్యాన్సర్ అవగాహన వారోత్సవాలు

కొమ్మాది: రుషికొండలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 27 నుంచి వారం రోజులపాటు గీతం దంత కళాశాల ఆస్పత్రి, గీతం వైద్య కళాశాలలో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని డా. మణీష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా నోటి క్యాన్సర్‌పై అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పొగాకు వాడుతున్నవారు ముందు జాగ్రత్తగా ఈ స్క్రీనింగ్ పరీక్షల ద్వారా రాబోవు ప్రమాదాన్ని తెలుసుకుని తగిన చికిత్సతో జాగ్రత్త పడవచ్చునని తెలిపారు.

శాస్త్రీయ నృత్య పోటీల్లో చిట్టివలస చిన్నారుల ప్రతిభ

తగరపువలస: సమ్మర్ ధమాకా కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం బాపూజీ కళామందిరంలో ఈ నెల 21న జరిగిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన పోటీల్లో చిట్టివలస విద్యార్థులు మొదటి బహుమతి సాధించారు. భారతీయ నటరాజ నృత్య నిలయానికి చెందిన జస్మిత బహుమతి సాధించింది. అలాగే హరిణి, భవిష్య, కీర్తిలకు ప్రత్యేక బహుమతులు లభించాయి. ఈ సందర్భంగా విద్యార్థులను, నృత్య నిలయం నిర్వాహకులను పెంట వెంకటరమణ శర్మ, తదితరులు అభినందించారు.

పూడిక తొలగింపు చర్యలు శూన్యం



ఎంవీపీ కాలనీ సెక్టార్ - 6లోని గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలు



సెక్టార్ - 7లోని గెడ్డలో వ్యర్థాల పరిస్థితి ఇదీ..



ఎంవీపీ కాలనీ సెక్టార్ - 11లోని గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలు

- ఎంవీపీ కాలనీ గెడ్డల్లో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు
- వర్షాకాలం సమీపిస్తుండటంతో ఆందోళనలో స్థానికులు

ఎంవీపీ కాలనీ: గెడ్డల్లో పూడిక పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. వివిధ ప్రాంతాల నుంచి గెడ్డల్లో చేరుతున్న వ్యర్థాలు పెద్ద ఎత్తున పేరుకుపోతున్నాయి. జీవీఎంసీ 17, 18, 19వ వార్డుల పరిధిలోని పలు ప్రాంతాల్లో గెడ్డల్లో పెద్ద ఎత్తున వ్యర్థాలు పేరుకుపోయాయి. ప్లాస్టిక్ బాటిళ్లు, చెత్త, మురుగునీరు, ఇతర వ్యర్థాలు పేరుకుపోవడంతో ఆయా ప్రాంతాల్లో అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. అయితే జీవీఎంసీ పారిశుధ్య అధికారులు గెడ్డల్లో పూడిక తీతను పట్టించుకోకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని ఆయా ప్రాంతాల్లోని నివాసులు ఆరోపిస్తున్నారు. వచ్చేది వర్షాకాలం కావడంతో గెడ్డల్లో పూడిక తొలగింపునకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేకుంటే వర్షాకాలం నాటికి ఇబ్బందులు తప్పవని ఆందోళన చెందుతున్నారు.

కొన్ని ప్రాంతాల్లో పరిస్థితి అధ్వానం

ఎంవీపీ కాలనీలోని అనేక ప్రాంతాల్లో గెడ్డల్లో వ్యర్థాల పరిస్థితి అధ్వానంగా ఉన్నప్పటికీ పలు ప్రాంతాల్లో ఆందోళనకరంగా ఉంది. ప్రధానంగా ఎంవీపీ కాలనీలోని సెక్టార్ – 2, 4, 6, 7, 8, 11లో పలుచోట్ల పరిస్థితి భయంకరంగా వుంది. గెడ్డలపై కల్వర్టులు ఉన్న చోట పూడిక భారీగా పేరుకుపోయింది. ఆయా ప్రాంతాల్లోని గెడ్డల్లో పేరుకుపోయిన వ్యర్థాల నుంచి వస్తున్న దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఇలానే కొనసాగితే వర్షకాలంలో దోమల బెడద తప్పదని ఆందోళన చెందుతున్నారు. డెంగ్యూ, మలేరియా వంటి విషజ్వరాలు ప్రబలే ప్రమాదం వుందని భయపడుతున్నారు. వీధుల్లో పారిశుధ్యంపైనే దృష్టి సారిస్తున్న సిబ్బంది గెడ్డలను శుభ్రపరచడంపై నిర్లక్ష్యం వహిస్తున్నట్లు వారు ఆరోపిస్తున్నారు. గత కొన్నేళ్లుగా కోట్లాది రూపాయలు ఖర్చు చేసి గెడ్డలను జీవీఎంసీ ఆధునీకరించిన విషయం తెలిసిందే. దీంతో మురుగునీరు ప్రవాహం విషయంలో పురోగతి లభించింది. అయితే ప్రస్తుతం నీటి ప్రవాహం పెద్దగా లేకపోవడంతో వ్యర్థాలు ఎక్కడివక్కడే ఉండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో పరిస్థితిని చక్కదిద్దాలని ఆయా ప్రాంతాల వాసులు కోరుతున్నారు.

తొలగింపులో నిర్లక్ష్యం తగదు

జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది రెండు నెలలకు ఒకసారి వచ్చి గెడ్డలోని చెత్తను తొలగిస్తుంటారు. ప్రస్తుతం చాలా నెలలుగా జీవీఎంసీ 17, 18వ వార్డుల్లోని గెడ్డల్లో చెత్తను తొలగించలేదు. దీంతో విపరీతంగా ప్లాస్టిక్ బాటిళ్లు, పాలిథిన్ కవర్లు పేరుకుపోయాయి. మురుగునీరు నిలిచిపోవడంతో దాని నుంచి వెలువడుతున్న దుర్వాసన భరించలేకపోతున్నాం.

– ఎల్లాజీ, ఎంవీపీ కాలనీ సెక్టార్ – 9

వర్షాలు కురిస్తే ఇబ్బందే..

గెడ్డల్లో మురుగునీరు, చెత్త నిలిచిపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. గెడ్డల పొడవునా అనుకొని వున్న ప్రాంతాల్లో దోమలు విజృంభిస్తున్నాయి. వర్షాలు ఎక్కువైతే పరిస్థితి ఇంకా అధ్వానంగా వుంటుంది. ప్రజలు విష జ్వరాల బారినపడే ప్రమాదం ఉంది. సకాలంలో జీవీఎంసీ సిబ్బంది స్పందించి గెడ్డలు, కాలువలను శుభ్రం చేయాలి. ఎప్పటికప్పుడు చెత్త, వ్యర్థాలు తొలగించాలి.

– కల్యాణ్, ఎంవీపీ కాలనీ సెక్టార్ – 11

ఐవీఎఫ్ కేంద్రంలో డీఎంహెచ్‌వో తనిఖీలు



అమృత ఐవీఎఫ్ కేంద్రంలో పరికరాలను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు బుధవారం ఏఆర్‌టీ, సరోగసీ బృందంతో కలిసి ఎంవీపీ కాలనీ సెక్టార్–10లోని అమృత ఐవీఎఫ్ కేంద్రాన్ని సందర్శించారు. ఆపరేషన్ థియేటర్, వార్డు, స్కానింగ్ మెషిన్‌ను తనిఖీ చేసి నిర్వాహకులకు పలు సూచనలిచ్చారు. ఐవీఎఫ్ కేంద్రాల నిర్వహణకు సంబంధించిన అనుమతులను పరిశీలించారు. డాక్టర్లు, స్టాఫ్ విద్యార్హతలు, ల్యాబ్ పరికరాలు పరిశీలించారు. ఈ కేంద్రాల్లో పేదవారికి ఫీజు తగ్గించి స్కానింగ్ చేయాలని సూచించారు. తనిఖీ బృందంలో ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ గీతా వందన, ఆంధ్రా యూనివర్సిటీ డాక్టర్ శోభశ్రీ, గాయత్రి వెల్ఫేర్ ఎన్జీవో ప్రతినిధి ఎల్.వి.రమణి, నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణ అధికారి (డెమో) బి.నాగేశ్వరరావు, మానిటరింగ్ కన్సల్టెంట్ కె.శివాజీ తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి బొండాల ధరలకు రెక్కలు

వేసవి ఎఫెక్ట్‌తో రూ.50కు చేరిక



మద్దిలపాలెం కూడలిలో కొబ్బరి బొండాలతో తోపుడుబళ్లు

మద్దిలపాలెం: మండుటెండల పుణ్యమాని ప్రకృతి సిద్ధంగా లభించే కొబ్బరి బొండాల ధరలకు రెక్కలొచ్చాయి. ఎండ తీవ్రత రానురాను ఎక్కువ కావడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక్క కొబ్బరి బొండాం ధర రూ.50కు చేరింది. అన్‌సీజన్‌లో బొండం ఒక్కొక్కటి రూ.20 నుంచి రూ.30 ఉంటే.. ఇప్పుడు ఏకంగా రూ.20 పెంచి వ్యాపారులు విక్రయిస్తున్నారు. లీటర్ కొబ్బరి నీళ్లు రూ.130కు చేరింది. ఎండ తీవ్రత నుంచి దాహార్తీతోపాటు శరీరానికి చల్లదనం ఇచ్చే కొబ్బరి బొండాలను తాగేందుకు మాత్రం జనం వెనుకాడటం లేదు. ప్రకృతి సిద్ధంగా లభించే కొబ్బరి బొండా కూడా ధర పెరిగి తమకు దూరమవుతోందని సామాన్యులు అవాక్ అవుతున్నారు. ఇవే ధరలు కొనసాగితే సాధారణ, మధ్యతరగతి వాళ్లు కొబ్బరి నీళ్లకు సైతం నోచుకోలేని పరిస్థితి ఎదురవుతుందంటున్నారు.

ఎండల కారణంగా కొబ్బరి బొండాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. డిమాండ్ తగ్గట్టుగా కొబ్బరి బొండాలు నగరానికి రావడం లేదు. దీంతో ఒక్కసారిగా వీటి ధరలు పెరిగాయని విక్రయాదారులు పేర్కొంటున్నారు. నగరానికి కొబ్బరి బొండాలు, శ్రీకాకుళం జిల్లా నలుమూలల ప్రాంతాల నుంచి దిగుమతవుతున్నాయి.

డివైడర్ పనులు నిలిచిపోవడంతో ఇబ్బందులు



తోటగరువు హైస్కూల్ వద్ద అసంపూర్తిగా డివైడర్ పనులు

ఆరిలోవ: బీఆర్‌టీఎస్‌లో పెదగదలి కూడలి నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మీదుగా తోటగరువు వరకు డివైడర్ నిర్మాణం పనులు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. వాహనదారుల రాకపోకలకు సౌలభ్య కోసం జీవీఎంసీ అధికారులు ఇటీవల ఈ పనులు ప్రారంభించారు. ఇక్కడ రోడ్డుకు ఇరువైపులా పాత్‌వేలు నిర్మించి మధ్యలో డివైడర్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులు జరుగుతుండటంతో ప్రస్తుతం ఇక్కడ రోడ్డు ఇరుకుగా మారింది. పాత్‌వేల కోసం తవ్విన మట్టి రోడ్డుపై వేయడంతో వాహనాల రాకపోలకలకు ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలో కొద్ది రోజులుగా పనులు నిలిచిపోయాయి. దీంతో వాహనచోదకులు మరింత ఇబ్బంది పడుతున్నారు. మరి కొద్ది రోజుల్లో వేసవి సెలవులు ముగియనుండడంతో హైస్కూల్ విద్యార్థులకు కూడా పాఠశాలకు వెళ్లడానికి ఇబ్బందులు కలగనున్నాయి. జీవీఎంసీ అధికారులు స్పందించి సత్వరమే డివైడర్, పాత్‌వే నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయించాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

ఏయూ వీసీతో చిరంజీవి చౌదరి భేటీ



చిరంజీవి చౌదరిని సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చిరంజీవి చౌదరి సందర్శించారు. బుధవారం విశాఖలో సదస్సులో పాల్గొన్న ఆయన ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డితో కార్యాలయంలో భేటీ అయ్యారు. ఏయూ చారిత్రక నేపథ్యం, ప్రత్యేకతలను తెలుసుకున్నారు. ఏయూలో జరిగిన అభివృద్ధి, వర్సిటీ నలుమూలలా స్థాపించిన టెక్, ఫార్మా, ఫుడ్, మెరైన్ ఇంక్యుబేషన్ కేంద్రాల పనితీరు, ప్రగతిని వీసీ తెలియజేశారు. ఈ సందర్భంగా ఏయూ తరపున చిరంజీవి చౌదరిని సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ హార్టీకల్చరల్ వర్సిటీ వీసీ ఆచార్య టి.జానకీరామ్, ఏపీ బయోడైవర్సిటీ బోర్డు అధికారులు పాల్గొన్నారు.

జీవవైవిధ్యంతోనే మానవాళి మనుగడ



సదస్సులో పాల్గొన్న శిక్షణార్థులు, నిర్వాహకులు

విశాఖ విద్య : మానవాళి మనుగడకు జీవవైవిధ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రభుత్వ డైట్ కాలేజీ సీనియర్ అధ్యాపకులు, ప్రముఖ ఉపన్యాసకులు గొట్టేటి రవి అన్నారు. టెక్నికల్ టీచర్ ట్రైనింగ్ శిక్షణలో భాగంగా బుధవారం వన్‌టౌన్‌లోని క్వీన్ మేరీ ప్రభుత్వ బాలికల పాఠశాలలో జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా సైన్స్ అధికారి కప్పల ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రవి మాట్లాడుతూ కాబోయే ఉపాధ్యాయులు ప్రకృతి పరిరక్షణ, దాని వినియోగం గురించి పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులను తీర్చిదిద్దే క్రమంలో ఉపాధ్యాయులందరికీ జీవ వైవిధ్యంపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా జీవ వైవిధ్యాన్ని కాపాడాలంటూ శిక్షణార్థులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాకినాడకు చెందిన పర్యావర్యణ కార్యకర్త కేసరి శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు డోల నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పునర్నిర్మాణ పనులు వేగవంతం చేయండి



మధురవాడ జోనల్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ



ఐటీ సెజ్ సమీపంలో పార్కు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

- జోనల్ కార్యాలయం పరిశీలించిన జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

మధురవాడ : జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 కార్యాలయం పునర్నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన నగరంలోని మధురవాడ జోనల్ కార్యాలయాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న పునర్నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయం అంతా ఆకర్షణీయమైన ఆకృతులతో నిర్మించాలని సూచించారు. ఆధునిక ఫర్నిచర్, విద్యుత్, కేబుల్ వైర్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యాలయం పక్కన ఉన్న సౌకర్యం కేంద్రం (సిటిజన్ సర్వీస్ సెంటర్)ని పరిశీలించి నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఐటీ సెజ్ వద్ద ఉన్న ఆదిత్య అపార్ట్‌మెంట్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ఐటీ సెజ్ పార్కును సందర్శించి పార్కులోని పనులు, సమీపంలోని టెన్నిస్ కోర్టు పార్కు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పర్యవేక్షక ఇంజినీర్ శాంసన్ రాజు, కార్యనిర్వాహక ఇంజినీరు శాంతిరాజ్‌ను ఆదేశించారు. ఐటీ సెజ్ రోడ్డులో ఉన్న అనధికార బడ్డీలను వెంటనే తొలగించాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏడీహెచ్ సురేష్, ఏఎంహెచ్‌వో కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

భానుడి ప్రతాపం.. రోడ్లు నిర్మానుష్యం



ఎండ తీవ్రతతో ఖాళీగా మద్దిలపాలెం రోడ్డు



జాతీయ రహదారిపై బోసిపోయిన సత్యం జంక్షన్



మండుటెండలో తలపై తువ్వాళ్లు కప్పుకుని వాహనంలో పనికి వెళ్తున్న కూలీలు

మద్దిలపాలెం: భానుడు బుధవారం ఉదయిస్తూనే భగ్గుమన్నాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ నిప్పులు కురిపించాడు. సూర్యుడి ప్రతాపంతో నిత్యం రద్దీగా ఉండే ప్రధాన కూడళ్లు జన సంచారం లేక బోసిపోయాయి. ఎప్పుడూ వాహనాల రద్దీతో కిటకిటలాడే మద్దిలపాలెం కూడలి, సత్యం జంక్షన్ మధ్యాహ్నం వేళ ఖాళీగా దర్శమిచ్చాయి. మండుటెండలో దినసరి కూలీలు పడరాని పాట్లు పడుతున్నారు. వాహనాలపై భవన నిర్మాణ సామగ్రిని తరలించే కూలీలు తలకు ఎండ నుంచి రక్షణగా తువ్వాళ్లు కప్పుకుని వారి పనుల్లో నిగమ్నమయ్యారు. బుధవారం ఉష్ణోగ్రత 36 డిగ్రీలు నమోదైంది. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో జనం ఇబ్బందులకు గురయ్యారు.

రేకుల షెడ్ల తొలగింపు

భీమునిపట్నం: భీమిలి పెద్దబజారులోని మార్కెట్‌లో అనుమతులు లేకుండా నిర్మించిన రేకుల షెడ్లను అధికారులు బుధవారం సాయంత్రం తొలగించారు. ఇక్కడ కొద్ది రోజులుగా కొత్త మార్కెట్ నిర్మాణం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఇక్కడి టౌన్ సర్వే నంబర్ 996లో ప్రభుత్వం స్థలం ఆక్రమించి కట్టిన షెడ్లను అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) శ్రీనివాసరావు, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి పర్యవేక్షణలో సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఎప్పటి నుంచో ఇక్కడి స్థలాన్ని ఆక్రమించి కొందరు షెడ్లు నిర్మించుకున్నారని, వాటిని ఇప్పుడు తొలగించామని తెలిపారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఫుట్‌పాత్ ఆక్రమించి బడ్డీ ఏర్పాటు



కొమ్మాది జంక్షన్‌లో ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన బడ్డీ

మధురవాడ : ప్రభుత్వ స్థలాలతోపాటు ఖాళీగా కనిపించే జంక్షన్లలోని ఫుట్‌పాత్‌లనూ ఆక్రమణదారులు వదలడం లేదు. జీవీఎంసీ 5వ వార్డు కొమ్మాది జంక్షన్‌లో సిగ్నల్ వద్ద ఉన్న ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన బడ్డీనే ఇందుకు నిదర్శనం. ఓ వ్యక్తి అత్యంత రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఫుట్‌పాత్‌పై హెచ్‌టీ విద్యుత్ లైన్‌ల కింద ఐరన్ రేకుల బడ్డీ బుధవారం సాయంత్రం ఏర్పాటు చేశాడు. జీవీఎంసీ అధికారులు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రారంభించేసి వినియోగంలోకి తీసుకొచ్చేస్తారు. ఇప్పటికే ఈ రోడ్డులో నిత్యం ట్రాఫిక్ ఎక్కువగా ఉండి, తరచూ వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో పాదచారులు నడవడానికి కూడా ఏమాత్రం అవకాశం లేకుండాపోతోంది. బడ్డీ ఏర్పాటు వల్ల ఫుత్‌పాత్‌పై కనీసం రెండు అడుగులు కూడా స్థలం లేకుండా పోయింది. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు, పాదచారులు కోరుతున్నారు.

కార్మికోద్యమ నేత 'పర్సా'కు నివాళి



పర్సా, తులసి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న సిటు నాయకులు

డాబాగార్డెన్స్: కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిన కార్మికోద్యమ నేత పర్సా సత్యనారాయణ అని సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ కొనియాడారు. జగదాంబ జంక్షన్ సమీపాన గల నండూరి ప్రసాదరావు భవన్ (ఎన్‌పీఆర్)లో బుధవారం పర్సా సత్యనారాయణ వర్ధంతి సభ నిర్వహించారు. ముందుగా పర్సా చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ సింగరేణిలో గుమస్తాగా పని చేస్తూ, అక్కడ పనిచేసే కార్మికుల సమస్యల పరిష్కారానికి యూనియన్ స్థాపించిన వ్యక్తి పర్సా అని, పరిశ్రమ స్థాయి నుంచి ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రానికి సిటు వ్యవస్థాపక అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారన్నారు. అలాగే విశాఖపట్నం అంగన్‌వాడీ ఉద్యోగుల యూనియన్‌కు అధ్యక్షురాలిగా పనిచేసిన వై. తులసి మృతికి సిటు సంతాపం తెలిపింది. అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎన్నో పోరాటాలు నిర్వహించారని కొనియాడారు. తులసి సంతాప సభలు అన్ని అంగన్‌వాడీ క్లస్టర్లలో నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిటు నాయకులు పి.మణి, ఎస్.జ్యోతీశ్వరరావు, బి.జగన్, ఎం.సుబ్బారావు, పి.వెంకట్‌రెడ్డి, యు.రామస్వామి, యు.రాజు, పి. అనసూయ, బి.రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఎరుకుమాంబ ఆలయానికి పోటెత్తిన భక్తులు



ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

సీతమ్మధార : బుధవారం దొండపర్తిలోని ఎరుకుమాంబ అమ్మవారికి భక్తులు పెద్ద ఎత్తున జలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు దొండపర్తి, నెహ్రూబజార్, రైల్వేన్యూకాలనీ, పెదవాల్తేరు, మద్దిలపాలెం, అక్కయ్యపాలెం, శివాజీపాలెం, ఎన్ఏడీ, సీతమ్మధార, నక్కవానిపాలెం, రేసవానిపాలెం, జగదాంబ, వన్‌టౌన్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ప్రధాన అర్చకులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకంతో పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. అలాగే సాయంత్రం కూడా భక్తులు అమ్మవారికి జలాభిషేకం చేశారు. పలు రకాల పూలతో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరుకుమాంబకు 'వాసుపల్లి' ప్రత్యేక పూజలు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారిని బుధవారం వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ దర్శించుకున్నారు. ముందుగా గణపతికి పంచామృతాభిషేకం చేసిన అనంతరం అమ్మవారికి పూజలు చేశారు. పంచామృతం, మామిడి పళ్ల రసంతో పాటు పసుపు నీళ్లతో అమ్మవారికి అభిషేకం చేశారు. అర్చకుడు శ్రీనివాస్ హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ విశాఖ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరినట్లు తెలిపారు. జగనన్న రాజ్యం రానుందని తెలిపారు.